క్లుప్తంగా

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర



మహాలక్ష్మమ్మ

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, పూజ ఘటం ఊరేగింపు, భక్తుల కోలాహలం నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. అమ్మవారికి సోమవారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. పలు రకాల పుష్పాలతో అమ్మ వారి ఆలయాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది.

నాణ్యమైన ఆహారం అందించాలి



మామిడికుదురులో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు శిక్షణ ఇస్తున్న ఏడీ సురేష్

మామిడికుదురు: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మధ్యాహ్న భోజన పథకం ఏడీ ఎస్.సురేష్ సూచించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణతో పాటు వంటల పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో సహా 72 స్కూళ్లలో పని చేస్తున్న ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. ఇంటి వంటను మరిపించే విధంగా స్కూల్ విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. మెనూ ప్రకారం ప్రతి ఒక్కరూ ఏ విధమైన సమస్యలు లేకుండా విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా వంటల పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, సీసీహెచ్ టి.తులసి, నగరం పీహెచ్‌సీ సీహెచ్ఓ కేఎస్ సత్యవతి, విద్యాశాఖ ఉద్యోగులు సౌజన్య, మౌనిక పాల్గొన్నారు.

శరీర దృఢత్వానికి క్రీడలు అవసరం



అంబాజీపేటలో తైక్వాండో విద్యార్థులతో ఎస్సై చిరంజీవి

అంబాజీపేట: శరీర దృఢత్వానికి, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న తైక్వాండో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఎస్సై చిరంజీవి మాట్లాడుతూ క్రీడలతో పాటు చదువులోనూ రాణిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలు పొందుతారన్నారు. అనంతరం తైక్వాండో విద్యార్థి ఎ.భార్గవి చైతన్య తల్లిదండ్రులు సమకూర్చిన ఫ్రూటీ జ్యూస్‌ను, బిస్కట్లను 60 మంది క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

గోవులకు సామూహిక సీమంతం



అప్పనపల్లిలో గోవు సీమంతంలో పాల్గొన్న ఆలయ ఈఓ మాధవి

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని గోకులంలో గోవులకు సోమవారం సామూహిక సీమంతం ఘనంగా నిర్వహించారు. నవ మాసాలు నిండిన గోవులకు శాస్త్రోక్తంగా సీమంతం జరిపించారు. 33 వేల కోట్ల దేవతా స్వరూపంగా భావించే గోవుకు సీమంతం వేడుక ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విష్వక్సేనారాధన, గోవుకు అష్టోత్తర పూజ, విశేషంగా చీర, సారె సమర్పించి గోవు ద్వారా సమాజానికి శుభదాయకం, శుభ ప్రదం కలగాలని, సమాజంలో ఉన్న అందరికి గోమాత ఆశీస్సులు లభించాలని ఆలయ ఉప ముఖ్య అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు జోత్స్యుల సోమయాజులు అభిలాషించారు. సీమంతంలో పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు. గోవుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

పాలిథిన్ సంచులు.. ఎన్నో అనర్థాలు



నిషేధిత క్యారీ బ్యాగులు

- గ్రామాల్లో పెరిగిన వాడకం
- వద్దని చెబుతున్నా వినని వైనం

అంబాజీపేట: పల్లెలు, పట్టణాలు అని తేడా లేకుండా ఎక్కడ చూసినా పాలిథిన్ సంచులే కనిపిస్తున్నాయి.. పర్యావరణానికి ముప్పు అని చెబుతున్నా, వీటి వాడకం ఎక్కడా ఆగడం లేదు. కొత్తపేట డివిజన్ పరిధి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో గ్రామ పంచాయతీలు ప్లాస్టిక్ సంచులను నిషేధిస్తూ 2022 డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేశాయి. కానీ అమలు మాత్రం లోపభూయిష్టంగా మారింది. ఏళ్ల క్రితమే ప్లాస్టిక్ నిషేధిస్తూ పంచాయతీ పాలకవర్గాలు తీర్మానం చేసినప్పటికీ, దీనిని పటిష్టంగా అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. ఒక్కో నియోజకవర్గ పరిధిలో రోజుకు అరటన్ను పాలిథిన్ సంచులు వినియోగిస్తున్నారని అంచనా. పాలిథిన్‌తో భూమి, నీరు, వాయువు కలుషితం అవుతుంది. భూగర్భ జలాలు దెబ్బతిని, సారవంతమైన పంట భూములు నిస్సారమవుతాయి. ప్లాస్టిక్ వాడకంతో మనుషులకు ప్రమాదకర క్యాన్సర్ వ్యాపిస్తుంది. నాడీ వ్యవస్థతో పాటు ఎర్ర రక్తకణాలు, కాలేయం, మూత్ర పిండాలపై ప్రభావం చూపుతుంది. ఇటీవల మాచవరం పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలని ర్యాలీ నిర్వహించడం అభినందించాల్సిన విషయం.

వినియోగం.. ప్రమాదకరం



"ప్లాస్టిక్ వినియోగం మానవాళితో పాటు జీవాలకూ ప్రమాదకరమే. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. జూట్, జనపనారతో సమస్యలు రావని గమనించాలి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ వినియోగించడం వల్ల తరచూ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి."

– ఎ.ఇంద్రావతి, పీహెచ్‌సీ వైద్యాధికారి, ముక్కామల

ముందస్తు జాగ్రత్తలు మేలు

నిత్యావసరాలకు జూట్, పేపరు, కాటన్ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ అపరాధ రుసుం విధించాలి. స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. ముఖ్యంగా ప్లాస్టిక్ నిషేధంలో ప్రజలను భాగస్వాములను చేయాలి.

విజయోత్సవ ర్యాలీలు నిషిద్ధం



పి.గన్నవరంలో సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ రమణ

అంబాజీపేట: జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగిసే వరకూ విజయోత్సవ ర్యాలీలను, బాణసంచా కాల్పులను నిషేధించామని ఎస్సై కె.చిరంజీవి, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీఓ వరలక్ష్మి తెలిపారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల జూన్ 6వ తేదీ వరకూ బహిరంగ సభలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. ఈ విషయాన్ని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడిన, వాట్సాప్ గ్రూప్‌లలో విద్వేషాలను రెచ్చగొట్టేలా పోస్టింగ్‌లు పెట్టినా, మోటార్ సైకిల్ సైలెన్సర్‌లు తీసి నడిపినా వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పోలీసు నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తామన్నారు. గుంపులుగా ఉండటం, సభలు, సమావేశాలు పెట్టడం వంటివి చేయకూడదన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ బి.మమత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

పి.గన్నవరం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు అందరూ సహకరించాలని కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ విజ్ఞప్తి చేశారు. వచ్చేనెల 4న ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో స్థానిక కోకోనట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్లు అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల నియమావళిని అందరూ పాటించాలని సూచించారు. ఎక్కడైనా ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు ఏజంట్లు, అభ్యర్థులు మాత్రమే రావాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా సేవలు అందించిన పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్లు, రూ.500ల వంతున ప్రోత్సాహకాన్ని అందజేశారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి షేక్ హుస్సేన్, సీఐ ప్రశాంత కుమార్, ఎస్సైలు బి.శివకృష్ణ, చిరంజీవి, రాజేష్, సురేష్, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వేదవిద్యకు పూర్వ వైభవం



గంగలకుర్రులో వేద విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న పండితులు

అంబాజీపేట: నేటి సమాజంలో వేద విద్యకు ఆదరణ పెరుగుతూ పూర్వ వైభవాన్ని సంతరించుకొంటుందని కర్రా సోమసుందరశాస్త్రి దత్తు అవధాని అన్నారు. శ్రీ గోదావరి మండల వేదశాస్త్ర ప్రవర్ధక సభా చారిటబుల్ ట్రస్ట్ 73వ వార్షికోత్సవ వేడుకలు గంగలకుర్రులో జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం స్వగృహంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద విద్యార్థులకు వేద పరీక్షలను వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ విద్యల్లో 28 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. పరీక్షాధికారులుగా కడియాల సీతారామావధాని ఘనాపాఠి, ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహ ఘనాపాఠి, గుల్లపల్లి శ్రీహర్ష ఘనాపాఠి పర్యవేక్షణలో వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ విద్యలలో విద్యార్థులకు పరీక్షలు జరిపారు. ఈ పరీక్షలు పూర్తిగా మౌఖిక విధానంలో జరిగాయన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు, పంపిణీ చేస్తామన్నారు. వేదం యొక్క ప్రాశస్త్యం, సామాజికహితం తదితర అంశాలపై నిర్వహించిన సాహిత్య ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. అంతకుముందు గణపతి పూజ, విద్యారణ్య స్వామి చిత్రపటానికి ఆవిష్కరించి వేద పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు చిలావర్తుల వెంకట సూర్యనారాయణమూర్తి, ఆకెళ్ళ వెంకట రామకృష్ణ కామేశ్వరశర్మ, కోశాధికారి అయ్యగారి లక్ష్మీనరసింహమూర్తి, సహాయ కార్యదర్శి భమిడిపాటి యజ్ఞేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మానేపల్లిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మానేపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పి.గన్నవరం: మానేపల్లి సుబ్బరాయ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా మేళ, తాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగింపుగా గ్రామ సరిహద్దులోని చాకలిపాలెం ఫంక్షన్ హాల్‌కు ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ 38 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు సమావేశమై నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులకు పాలతో పాదపూజ చేశారు. గురువులకు మెమెంటోలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఆద్యంతం, ఉల్లాసంగా, ఉత్సాహంగా సందడి చేశారు. సుకుటుంబ సపరివార సమేతంగా సమావేశంలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సమ్మేళనంలో కోళ్ల తిరుమలరావు, తాడి రంగారావు, చెల్లుబోయిన వెంకటరమణ, భయ్యా బాబూరావు, మొల్లేటి శ్రీనివాసరావు, మహ్మద్ మొహిద్దీన్, పైడి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యాన సాగులో మెళకువలు అలవరచుకోవాలి



ఉద్యానరైతు సదస్సులో ప్రయోగాలను పరిశీలిస్తున్న రైతులు, ఉద్యానశాఖ ప్రతినిధులు

ఆలమూరు: ఉద్యానవన పంటలకు సంబంధించి ఎప్పటికప్పుడు అందుబాటులోకి వచ్చే ఆధునిక పద్ధతులు, మెళకువలు అవగాహన చేసుకుంటూ సాగు చేపడితే అధిక దిగుబడులతో మెరుగైన ఆదాయాన్ని పొందవచ్చని వెంకటరామన్నగూడెం యూనివర్సిటీ హార్టికల్చర్ సైంటిస్ట్ ఎన్‌బీవీ చలపతిరావు, అంబాజీపేట హార్టికల్చర్ సైంటిస్ట్ గోవర్ధన రావు, నియోజకవర్గ ఉద్యానవన అధికారి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని చెముడులంక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో మండల ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఉద్యాన రైతు సదస్సుకు సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అందులో భాగంగా వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయానికి చెందిన 17 మంది విద్యార్థులు చెముడులంక, బడుగువానిలంక పరిధిలో ఉద్యానవన పంటలపై గత నాలుగు నెలలుగా చేసిన ప్రయోగాలను విశదీకరించారు. ఉద్యానశాఖ సూచనలు, సలహాలను తీసుకుంటూ తేనె పట్టు పెంపకం చేస్తే అధికాదాయం సముపార్జించవచ్చని తెలిపారు. రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని తద్వారా సాగు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటలు పొందవచ్చన్నారు. పశువుల సంతతికి సంబంధించి ఆవుల పెంచడం ద్వారా జీవామృతం వంటి ఎరువు తయారు చేసి పంటప పొలాల్లో వేయాలన్నారు. అలాగే నీటి యాజమాన్య పద్ధతులలో బిందు సేద్యం చేయడం ద్వారా పెట్టుబడి తగ్గించుకోవచ్చన్నారు. ఎరువుల వాడకం, కలుపు మొక్కల నివారణ తదితర అంశాలపై విద్యార్థులు వివరించారు.

ఆకట్టుకున్న షార్ట్ ఫిల్మ్

పూల తోటల పెంపకంలో ఎండిన పువ్వులు వాటి ఉపయోగం, సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ ఫోటోల తయారీ తదితర అంశాలపై నాటిక రూపంలో విద్యార్థులు ప్రదర్శించిన వీడియో షూట్ రైతులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పటి వరకు ఉద్యాన విద్యార్థులంతా ఆయా గ్రామాల్లో రైతులతో గడిపిన ప్రతి అంశాన్ని వీడియో షూట్ చేస్తూ చేసిన షార్ట్ ఫిల్మ్ ప్రదర్శన రైతులను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఉద్యానవన పంటలపై వివిధ సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన ప్రాజెక్టులను వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థి లాభసాటి పద్ధతులను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దూలం సత్తిబాబు, అడబాల వీర్రాజు, దొండపాటి శ్రీను, బుడ్డిగ వీర వెంకట్రావు, వీహెచ్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

రామరాజులంక బస్ సర్వీసు పునరుద్ధరించాలి

మలికిపురం: రాజోలు డిపో నుంచి వయా రామరాజులంక మీదుగా అప్పనరామునిలంక వెళ్లే ఆర్టీసీ బస్ సర్వీసు పునరుద్ధరించాలని వినియోగదారుల సంఘ రాష్ట్ర ప్రతినిధి మాలే శ్రీనివాస్ నగేష్ కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పదేళ్ల క్రితమే ఈ సర్వీసును ఆర్టీసీ విరమించుకుందని ఆయన అన్నారు. అప్పట్లో ఇక్కడ రోడ్లు సరిగా లేక విరమించిన ఈ సర్వీసును ప్రస్తుతం రోడ్లు మెరుగైన స్థితిలో ఉన్న కారణంగా వెంటనే పునరుద్ధరించాలని కోరారు. పైగా రాజోలు డిపో నుంచి వయా శివకోడు, దిండి, రామరాజులంక, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, గుడిమూల, రామేశ్వరం, మీదుగా అంతర్వేది పుణ్యక్షేత్రం, పల్లిపాలెం వరకూ బస్ నడిపితే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండడంతో పాటు ఆర్టీసీ సంస్థకు లాభసాటిగా కూడా ఉంటుందని ఆయన అన్నారు. దీనిపై అధికారులు వెంటనే పరిశీలించి బస్ ప్రవేశపెట్టాలని కోరారు.

చారిత్రక అంశాలపై అవగాహన

అంబాజీపేట: చారిత్రక అంశాలు తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, స్థితిగతులు వంటివి తెలుసుకోవచ్చని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా చారిత్రక కథలు, నీతి కథలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నీతి కథలు వినడం, చదవడం ద్వారా విద్యార్థులు ఉన్నత భావాలు కలిగి ఆదర్శవంతంగా సమాజంలో జీవిస్తారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, రీడర్లు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలి



మామిడికుదురులో విద్యార్థినికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న సీఐ ప్రశాంత్‌కుమార్

మామిడికుదురు: విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్ కుమార్ సూచించారు. ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన మామిడికుదురు దీప్తి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల అభినందన సభ ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం జరిగింది. విద్యార్థుల విజయానికి వారి ప్రవర్తనే దిక్సూచిగా నిలుస్తుందని సీఐ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రవర్తన ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. పరీక్షల్లో రాణించేందుకు మానసిక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోలీసులతో పాటు పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవలందించారని వారిని సీఐ అభినందించారు. 71 మంది విద్యార్థులకు గౌరవ పారితోషకం, ధ్రువీకరణ పత్రాలు అందించి, వారిని అభినందించారు. సమావేశంలో నగరం ఎస్సై పి.సురేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వి.నాగరాజు, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తీర్థం



బంగారమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపేట: స్థానిక గ్రామ దేవత బంగారమ్మ(బంగారు పాప) అమ్మవారి తీర్థ మహోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. తీర్థ మహోత్సవాలు పురస్కరించుకుని బంగారమ్మ అమ్మవారిని, గర్భాలయాన్ని విశేషంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి, చలివిడి, పానకాలు నైవేద్యాలు, చీరలు, గాజులు, పసుపు – కుంకుమలు, ఇతర మొక్కులు సమర్పించారు. 10 గంటల సమయంలో ఆలయ అర్చకులు మహాకుంభాభిషేకం సమర్పించారు. కొత్తపేట పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలో పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకూ ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సలాది బ్రహ్మానందరావు (బాబ్జి) ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆ ప్రాంత యువకులు, భక్తులు సౌకర్యార్థం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం, మజ్జిగ సరఫరా చేశారు. ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్‌ను కౌశికరోడ్డు, బోడిపాలెం నుంచి వాడపాలెం మీదుగా మళ్లించారు.

ప్రారంభానికి ముందే పాఠ్య పుస్తకాలు



అంబాజీపేటలో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు



అయినవిల్లి మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ

అంబాజీపేట: పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్నామని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం నుంచి మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సిద్ధం చేశారు. ఆయన మాట్లాడుతూ ఒకటి నుంచి పదో తరగతి వరకూ వివిధ సబ్జెక్టులకు సంబంధించి 22,263 పాఠ్య పుస్తకాలు, 21,990 నోట్ బుక్‌లు, 24,99 బెల్ట్‌లు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు విడతల వారీగా వస్తున్నాయన్నారు. మండలలోంలో హైస్కూళ్లు 9, ప్రాథమిక పాఠశాలలో 55 పాఠశాలల్లో 3,530 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. త్వరలో స్కూల్ బ్యాగ్స్, యూనిఫాం, షూలు రావాల్సి ఉందన్నారు. స్కూల్ తెరిచే నాటికి అందజేస్తామన్నారు. వారికి పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అదే విధంగా నాడు–నేడు పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా దృష్టి సారించామన్నారు.

పాఠశాలలకు చేరుకున్న జగనన్న విద్యాకానుక కిట్లు

ఆలమూరు: వేసవి సెలవులకు ముగియక ముందే పాఠశాలలు తెరవక ముందే జగనన్న విద్యాకానుక కిట్లు మండల విద్యాశాఖ కార్యాలయానికి చేరినట్లు ఎంఈఓలు ఎస్‌వీ సుబ్బరాజు, పి.షాలెంరాజు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 50 జెడ్పీ, ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలుండగా అందులో 3552 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వారందరికీ సంబంధించిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు తొలివిడతగా సరఫరా జరిగిందన్నారు. మండలానికి 31,697 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా తొలి విడతలో17546 పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయన్నారు, అలాగే పూర్తి స్థాయిలో 25,326 నోట్ పుస్తకాలు, 2269 బెల్ట్‌లు కూడా దిగుమతి చేసుకున్నామన్నారు. ప్రస్తుతం విద్యాకానుక కిట్లను సీఆర్‌పీలు పార్ట్‌టైం ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలలకు చేరవేస్తున్నామన్నారు. పాఠశాలలు తెరవగానే విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేస్తామని ఎంఈఓలు పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థి చేతిలో విద్యా కానుక

అయినవిల్లి: పాఠశాలల పునః ప్రారంభం రోజున ప్రతి విద్యార్థి చేతిలో విద్యా కానుక ఉంచేందుకు పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు చేస్తున్న కృషికి అనుగుణంగా పనిచేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదన రావు సూచించారు. మండలంలోని సిరిపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 1–7 తరగతులకు రాజమహేంద్రవరంలోని పుస్తక గోదాం నుంచి, 8,9,10 తరగతులకు నేరుగా పబ్లిషర్స్ నుంచి మండల కేంద్రాలకు పాఠ్య పుస్తకాలు చేరుకుంటున్నాయన్నారు. ఇప్పటికే మండల స్టాక్ పాయింట్లకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు చేరుకున్నాయన్నారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల స్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీల పనితీరును ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖాధికారులు సమీక్షించాలన్నారు. అలాగే నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈవోలు జేవీ కనకదుర్గ, పి.శ్రీనివాసరావులకు సూచించారు. మండల స్టాక్ పాయింట్‌లో నిర్వహిస్తున్న రికార్డులను ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పద్యకవుల సమ్మేళనంలో ప్రతాప్‌కు సత్కారం



ఏలూరులో ప్రతాప్‌ను సత్కరిస్తున్న సాహితీ ప్రముఖులు

సఖినేటిపల్లి: ఏలూరులో ఆదివారం రాత్రి శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన పద్య కవులకు పట్టాభిషేకం పేరుతో అంతర్జాతీయ శతాధిక పద్య కవుల సమ్మేళనంలో కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌ను స్వర్ణకంకణంతో సాహితీ ప్రముఖులు సత్కరించారు. ప్రతాప్ సాహిత్య సేవలను ప్రశంసిస్తూ, శ్రీనాథుని 13వ తరం వంశీయుడు ప్రముఖ కవి, పరిశోధకుడు డాక్టర్ కావూరి శ్రీనివాసవర్మ, మానవతా విద్యానిధి చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు శ్రీహరి కోటి ఆధ్వర్యంలో ప్రతాప్‌కు స్వర్ణకంకణం తొడిగి, జ్ఞాపికను బహూకరించారు. కాగా 175 మంది సీస పద్య కవులతో శ్రీనాథుని సీస పద్య వైభవం పేరిట రూపొందించిన సంకలనం పుస్తకాన్ని కూడా సమ్మేళనంలో ఆవిష్కరించారు. పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.